# దురదృష్టవంతురాలు

మిస్ యస్. యస్. దేవి

అప్పుడు 9.30 గం|| కావస్తున్నది. సినిమా మొదటిఆట పూర్తిఅయినది. గొప్ప, బీద, చిన్న, పెద్ద, ముసలీముతుక అందరూకలసి హాయిగా సినిమా వుషారులోపడి "దేవికారాణి బాగా పాడ్తుంది. అశోక్ కుమారుడు బాగా నటిస్తాడు" అని కులాసాగా మాట్లాడుకుంటూ మెల్లిమెల్లిగా ఆచల్లని వెన్నెల్లో జట్లు జట్లుగా కలసి వెళ్లుతున్నారు.

అప్పుడే ఒకగ్రుడ్డివాడు తన వుద్యోగం మొదలెట్టాడు, ముష్టిచిప్ప చేతపుచ్చుకుని. ఆ వుద్యోగానికి వేళాపాళా అనేదేమీ లేదుగా మరి! ఆ గ్రుడ్డితనానికి తోడుగా ఒకచిన్న పిల్లకూడావుంది వెంట. మొన్న మొన్ననే పోయింది భార్యకూడాను. ఆచిన్నపిల్లే తల్లికిబదులుగా అన్నిచోట్లా విసుగులేకుండా తిప్పుతుం డేది. రాత్రిపగలూలేకుండా యిద్దరూ చెరొకటి చేత పుచ్చుకుని బయల్దేరారు. ఎవరికైనా దొరుకుతుందనే ఆశతోటి...ఆపిల్లపేరు రాధ.

"గ్రుడ్డివాణ్ణండి బాబయ్యా...
మీ పాదాలకు మొక్కుతా సామీ...
ఒక్కరాగిదమ్మిడీ వెయ్యండి బాబులూ,
మీ కడుపున పుట్టుతా బంగారపు బాబులూ..."
బాబూ...బాబూ...ఒక్కకాని!...ఒక్కకాని...
కడుపు మాడ్తున్నది చచ్చిపోతున్నాము...
వాడిఖర్మం...ఏంజేస్తాము...
వాడి గతంతే...యేడవనీ...వెధవలు...

అని అనేక కేకలు వినబడ్డాయిగాని...ఒక్కడూ ఒక్కదమ్మిడీకూడా యివ్వలేదు...కాళ్లను అడ్డాలు పడినా ఒక్కడూ ఒక్కదమ్మిడీఅయినా యివ్వలేదు. నిన్నంతా పస్తే, యివ్వాళ్లంతా పస్తే...ఆ యిద్దరూ ఎప్పుడు ప్రాణాలు గుటుక్కుమంటాయో అనేలాగున్నారు. పోనీ తనకు లేకుంటే పిల్లకైనా ఒకపట్టెడు మెతుకులు దొరుకుతాయేమోనని ఆవూళ్లోవుండే ఒకపెద్ద హోటల్‌కి వెళ్లాడు. అప్పటికప్పుడే 12 గం|| అయింది. అందరూ చాలావరకు సగంనిద్రలో వుంటారు. పాపం! ఆ చిన్నపిల్లకుకూడా నిద్రరాదు మరీ! నిద్రవచ్చి "నాన్నా! యీపూటకు లేకుంటే పోనీలే, రేపు తెచ్చుకుతిందాము. నిద్రవస్తుంది. రాలేను" అని తండ్రి ఒడిలో పడింది. తండ్రి కన్నీరుగార్చి యేమీచెయ్యలేక వూరుకున్నాడు, ఏంచేస్తాడు, ఎవరిని తిట్టాడు? ఎవరినంటాడు? ఎవరినంటె ఎవరు ఊరుకుంటారు? తనలో తానే కొంచెంసేపు సణుక్కుంటూ, గొణుక్కుంటూ నిద్రపోయాడు.

తెల్లారినది. రాధ యింకా లేవలేదు. 8 గం|| కావస్తున్నది. సూర్యుడు బలవంతంగావచ్చి కళ్లలో పొడిచి లేపుతున్నా లేవలేదు. తండ్రి యెలాగో ఒకకర్రను పట్టుకుని మెల్లిమెల్లిగావచ్చి, "లే నా బుల్లితల్లి లే నా బంగారుతల్లీ లే" మని బలవంతంగా లేపాడు. రాధ వెంటనే లేచి కాలకృత్యాలన్నీ తీర్చుకుని, తండ్రి దగ్గరకొచ్చి కూర్చున్నది. "నాన్నా దేవుడు నిన్ను యీలాగు ఎందుకు పుట్టించాడు? నువ్వుచూస్తే దేవుడు చూడలేడా! పోనీ డబ్బయినా యివ్వకూడదా? పోనీ అమ్మనికూడా ఎందుకు తీసుకెళ్ళాలి?...అని యేవేవో

కూర్చుని అడగటం మొదలెట్టింది. చిన్నపిల్లయినా రాధ వూహాలకు ఆలోచనలకు మాత్రం చిన్నదికాదు. తండ్రికి అమిత దుఃఖం వచ్చి "అమ్మాయీ...నీకెందుకులే ఆ గొడవంతా, పదా, కాస్త తెచ్చుకుని తిందాం" అని ఆ మాటల్లోంచి తప్పించి మెల్లిగా యిద్దరూ బయల్దేరారు.

ఆవూళ్లో ఒకగొప్ప షాహుకారుగారువున్నారు. ఆషావుకారుగారింటికే మనరాధ గ్రుడ్డివాడు వెళ్ళారు. మళ్లీ పాడారు వాళ్లపాట గంటన్నరా...నోరుకూడా నొప్పిపెట్టింది. చివరకు ఆషావుకారు ఒక నౌకరునుపిలిచి ఒరేయ్‌సుబ్బాయ్ ఈ వెధవముష్టివాణ్ణి అవతలకినెట్టు అని అనీ అనటంతోటి ఒకరికిద్దరు వచ్చి అవతలకు నెట్టారు. గ్రుడ్డివాడుగా పాపం! ఆపక్కనేవున్న రాయిమీదపడ్డాడు. రాయి తలకు తగిలి రక్తము వరదలుగాకారి పడిపోయాడు. రాధ యేడుస్తూవచ్చి "నాన్నాలే తెచ్చుకుతిందాం...లే...నాన్నా...లే..." అని మొండెత్తి యేడ్చింది. ఎవ్వరూ పలుకరించినవాళ్లు లేరు. అటుచూచిన వాళ్లు లేరు. పాపం ఆరాధకు యేమి తెలుసూ?...అప్పుడే పోయింది ప్రాణం......పాపం! రాధయొక్క దురదృష్టము!

# ఆంధ్రమాత!

గీ. బీదవారలు నీవారు, పేదనీవు
కట్ట గుడ్డలులేవు, తాకట్లపాలు
ఇంట సొమ్ములన్నియును, వెంటబడెడు
భీకర దరిద్రదేవతే నీకు తోడు.

గీ. ఆస్తులే లేకపోయిన, అస్త్రైన
తెనుఁగు బిడ్డను బాయునే తెగువుమీఁఱ?
ఎండు టెముకల నంటిన దెప్పుడోను
పౌరుషంపు రక్తకణిక చేరువగను.

గీ. మాటిమాటికి యుబుకుచు, సాటిలేక
వెచ్చ కొన్నెత్తురీ హృదయ వీధులపుడె
బాసిపోలేదు రూపునమాసిపోయి
నేటికైనను, తాతలనాటిదైన.

గీ. తాతలెప్పుడో చేసిన చేతలిపుడు
మరల మరల నేటిసుతులు మరచిపోక
తలఁచుచుండుటఁ, జూడ, తాతలను మించు
మనుమలున్నారు, నేడాంధ్రమాత! నీకు.

—ఘండికోట బ్రహ్మాజీరావు.